అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, స్టామ్ వాటర్, బాక్స్ డ్రెయిన్ తదితర అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే చేపట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్ పూల్ తదితర నిర్మాణాల పురోగతిపై చర్చించారు. ఇంత కాలం ఎన్నికల బిజీలో ఉన్న అధికారులు అభివృద్ధి పనులపై దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో మోతె శోభన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హేమలత, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశలత, డిప్యూటీ ఇంజినీర్ సువర్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటేష్ తదితరులున్నారు.

బీరప్ప టెంపుల్ వద్ద అన్నదానం



లాస్యను సన్మానిస్తున్న మహిళలు

రసూల్‌పురా: అమావాస్య సందర్భంగా కంటోన్మెంట్ రసూల్‌పురా బీరప్ప టెంపుల్ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ ఎమ్మెల్యే లాస్య నందిత ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలపై భగవంతుని కృపా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గజ్జెల నాగేష్, నివేదిత. టీఎస్. శ్రీనివాస్, డీ. శ్రీనివాస్, జంగిలి రాజు, దయానంద్, మీసాల యాదగిరి, కిట్టు, పనస సంతోష్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

లాలాపేట: అమావాస్యను పురస్కరించుకుని లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లాలాపేట రామ్ థియేటర్ ఎదురుగా అన్నదాన వితరణ కార్యక్రమం జరిగింది. వాసవిమాతకు ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో అన్నదాన వితరణ ఒకటన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సాంబశివరావు, భాస్కర్, నేతిరాములు గుప్తా, ఎనిశెట్టి కృష్ణ, రవిప్రకాష్, బాల్‌రాజు, నంగూరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాజు విఠల్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నియామకపత్రాలను అందుకున్న సొసైటీ నూతన కమిటీ నాయకులు

లాలాపేట: వడ్డెర కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనివ్వాలని శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షుడు గండికోట కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో సంఘం ఏర్పాటై 9 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా గండికోట కుమార్, ఉపాధ్యక్షుడిగా గండికోట శ్రీనివాస్, కార్యదర్శిగా గండికోట కిరణ్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా గండికోట శివ, జాయింట్ సెక్రటరీగా దుర్గేష్, సలహాదారులుగా గండికోట కుమార్, యాదయ్య, గిరి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా లక్ష్మణ్ తదితరులు ఎన్నికయ్యారు.

దివ్యాంగురాలికి చేయూత



కుట్టు మెషిన్‌ను అందజేస్తున్న డాక్టర్ సారతా

అడ్డగుట్ట: దివ్యాంగులకు పలు స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని సెవెన్ రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సారతా మురుగన్ అన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ దివ్యాంగురాలికి జీవనోపాధి కల్పించేందుకు కుట్టు మెషీన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సారతా మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యం అనేక మంది పేద ప్రజలు, విద్యార్థులు, దివ్యాంగులకు సేవలందించడంతో పాటు జీవనోపాధి కల్పించే విధంగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు.

పడకేసిన పాలన వ్యవస్థ

7 నెలల నుంచి ఖాళీగా జలమండలి మారేడ్‌పల్లి సబ్ డివిజన్ జీఎం పోస్టు

- అర్హులు లేరా.. నియామకంపై నిర్లక్ష్యమా?
- సమస్యలు పరిష్కారం కాక జనం అవస్థలు
- నూతన ప్రభుత్వంలోనైనా జీఎం నియామకం జరిగేనా?



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మారేడ్‌పల్లి జలమండలి జనరల్ మేనేజర్ పోస్టు భర్తీకి ముహూర్తం ఎప్పుడో అంతుచిక్కకుండా పోతోంది. నిత్యం కార్యకలాపాలతో సందడిగా ఉండే సబ్ డివిజన్‌కు పూర్తిస్థాయి జీఎం లేక ఓ వైపు ప్రజలు మరో వైపు ఉద్యోగులు, సిబ్బంది పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. చాలా కాలం నుంచి జీఎం పోస్టు ఖాళీ ఉంది. ఇక్కడ పని చేసిన రమణారెడ్డి అనారోగ్యంతో మే నెలలో మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. పూర్తిస్థాయి జీఎం లేకపోవడంతో సీజీఎం ప్రభు ఇక్కడి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుమారు 7 నెలల నుంచి జీఎం పోస్టు ఖాళీ ఉండటంతో ఇక్కడ పరిపాలన పడకేసిందనే చెప్పాలి. నెలలు గడుస్తున్నా భర్తీ కాకపోవడం పలు సందేహాలకు తావునిస్తోంది. అర్హులు లేరా..లేక సమర్థుల కోసం వెతుకుతున్నారా.. పోస్టు భర్తీపై నిర్లక్ష్యమా అనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మారేడ్‌పల్లి సబ్ డివిజన్ సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్, కొద్ది పాటి కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలలో విస్తరించి ఉంది. నెలలు గడుస్తున్నా జీఎం నియామకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పరిపాలన, కార్యకలాపాలపై ప్రభావం

పూర్తిస్థాయి జీఎం లేకపోవడం కారణంగా పరిపాలన పరంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఎలాంటి సమస్యలున్నా జీఎం స్థాయిలో పరిష్కారమయ్యేవి. సుమారు 7 నెలల నుంచి పరిపాలన పరంగా సిబ్బంది, సమస్యల విషయంలో ప్రజలు ఇక్కట్లకు లోనవుతున్నారు. జీఎం ఉన్నప్పుడు ప్రతి రోజు సెక్షన్ కార్యాలయాల వారీగా ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై నిత్యం సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే వారని సిబ్బంది, ప్రజలు గుర్తు చేస్తున్నారు. మారేడ్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలో బోయిగూడ, హుస్సేన్‌సాగర్ పంప్ హౌస్, మారేడ్‌పల్లి, శ్రీనివాస్ నగర్, అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, రిజిమెంటల్‌బజార్, నల్లగుట్ట, తార్నాక తదితర 12 సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. సదరు సెక్షన్ కార్యాలయాల నుంచి ప్రతి రోజు 25 నుంచి 30 వరకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు, నీటి ఎద్దడి, డ్రైనేజీ, కలుషిత జలాల సరఫరాపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వస్తుంటాయి. అయితే సెక్షన్ స్థాయిలో పరిష్కారానికి నోచుకోకుంటే అనేక మంది జీఎం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకునేవారు.

పేరుకుపోతున్న ఫిర్యాదులు..

నూతన కనెక్షన్ల మంజూరులో జాప్యం కారణంగా ప్రజలు పలు సమస్యలకు గురవుతున్నారు. మారేడ్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు శుభ్రం చేసే 7 భారీ, 10 చిన్న హేర్‌టెక్ వాహనాలు ఉన్నాయి. అయితే వీటి నియంత్రణ, పని విషయంలో సెక్షన్ మేనేజర్ కార్యాలయాల స్థాయిలో పలు సమస్యలు నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా హేర్‌టెక్ వావాహనాల పనితీరుపై పలు సెక్షన్ మేనేజర్లు, సదరు వాహన నిర్వాహకుల మధ్య సఖ్యత లేమితో పలు సమస్యలు నెలకొని ఉన్నాయి. దరిమిలా ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ మురికినీరు రోడ్లపై ఏరులై పారుతున్నది. పలు సెక్షన్ కార్యాలయాల పరిధిలో ప్రజాభివృద్ధి పనులపై తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ప్రతి రోజు సాయంత్రం జీఎం కార్యాలయానికి వెళ్లి సమస్యలపై జరుగుతున్న నిర్లక్ష్యం..జాప్యం గురించి ఆయనను కలిసి విన్నవించి సమస్యలను పరిష్కరించే సంప్రదాయం ఉండేది. ప్రస్తుతం జీఎం లేకపోవడంతో తమ సమస్యలను ఎక్కడి వెళ్లి ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

వెంటనే జీఎం నియామకాన్ని చేపట్టాలి..

సికింద్రాబాద్ జలమండలి మారేడ్‌పల్లి సబ్ డివిజన్ జనరల్ మేనేజర్ నియామకాన్ని వెంటనే చేపట్టాలని పలువురు కోరుతున్నారు. సుమారు 5 నెలల నుంచి పూర్తి స్థాయిలో జీఎం లేకపోవడంతో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఆయా సెక్షన్ పరిధిలో మేనేజర్లు సమస్యలపై సకాలంలో స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తిస్థాయి జీఎం నియామకాన్ని చేపట్టాలని ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

బీజేపీ శ్రేణుల నిరసనలు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంటిపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు జరిపిన సోదాల్లో రూ. 351 కోట్ల నగదు లభ్యమైన ఘటనను నిరసిస్తూ మంగళవారం సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డు బాటా చౌరస్తాలో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మర్రిశశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ ఇంట్లో పెద్ద ఎత్తున నగదు దొరికినా కాంగ్రెస్ అధినాయకత్వం నోరు మెదకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమ సొమ్ముతో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అవినీతి రహిత పాలనతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అక్రమ, అవినీతి కార్యకలాపాలను ప్రజలు గ్రహించాలని కోరారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపికా నరేష్, టి. రాజశేఖర రెడ్డి, శ్రీశైలం గౌడ్, పెద్ది రవీందర్, దయానంద్‌రావు గుంటి సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్'

కంటోన్మెంట్: కాంగ్రెస్ పార్టీ అవినీతికి కేరాఫ్ అని కంటోన్మెంట్ బీజేపీ ఇన్‌చార్జి శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూపై ఐటీ దాడుల్లో పట్టుబడ్డ రూ.500 కోట్లకు సంబంధించి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం బీజేపీ నేతలతో కలిసి జేబీఎస్ చౌరస్తాలోని వివేకానంద్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీగణేశ్ మాట్లాడుతూ.. ఐటీ దాడుల విషయంలో పదేపదే విమర్శలకు దిగే కాంగ్రెస్ నేతలు, తాజా ఘటనలో పట్టుబడ్డ సొమ్ము విషయంలో స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరశురామ్, బీఎన్ శ్రీనివాస్, టోపీ శంకర్, విజయానంద్, జాయింట్ కన్వీనర్ సతీష్, జేవీ నర్సింగరావు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి చౌరస్తాలో..

చిలకలగూడ : అవినీతి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సీతాఫల్‌మండి చౌరస్తాలో మంగళవారం పలువురు బీజేపీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. జార్ఖండ్ ఎంపీ ధీరజ్ సాహు నివాసంలో రూ. కోట్లలో నల్లధనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారని కాంగ్రెస్ అధినాయకులు సోనియాగాంధీ, ఖర్గేలకు ధీరజ్‌సాహు అత్యంత సన్నిహితుడని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, నాగేశ్వరరెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, కనకట్ల హరి, రమేష్, శారద మల్లేష్, నరేష్, వేణు, మహేష్, రాముశర్మ, అనూష, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 20, దోసకాయ 28, బీట్‌రూట్ 33, ఉల్లిగడ్డ 36, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సమస్యల పరిష్కారానికి వినతి

లాలాపేట: తార్నాక స్ట్రీట్ నెంబర్-10లోని హైటెన్షన్ వైర్ల సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు మంగళవారం టీపీసీసీ కార్యదర్శి అమర్‌నాథ్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ ఇళ్లపై నుంచి హైటెన్షన్ వైర్లు ఉండటంతో ఎప్పుడు ఏలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందన్నారు. గతంలో పలుమార్లు విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయని సంబంధిత అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

అడ్డగుట్ట: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డేవిజ్ రాజు వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని కామారెడ్డికి చెందిన సంఘ రాజేష్(27) తన చిన్నమ్మ వద్ద ఉంటూ అల్వాల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రాజేష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం బొల్లారం-గుండ్ల పోచంపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సురేష్‌గౌడ్

హామీలను నెరవేర్చడమే లక్ష్యం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని నెరవేర్చడమే తన లక్ష్యమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎమ్మెల్యేగా మూడోసారి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో పలువురు ఆయనను కలిసి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. హౌసింగ్ ఎస్ఈ వెంకటదాసురెడ్డి, డీఈ గంగాధర్, జెక్‌కాలనీకి చెందిన సురేష్‌గౌడ్, రేణుకానగర్‌కు చెందిన కమిటీ ప్రతినిధులు లాహోర్‌సింగ్, యాదగిరి, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, మల్లేష్, బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌సీ పటేల్, కుమార్, సుభాష్‌చంద్రారెడ్డి, బ్రహ్మకుమారీస్ సునీత, బిందు, రంజన్, సనత్‌నగర్ లోధా అపార్ట్‌మెంట్‌కు చెందిన పారిశ్రామికవేత్త సుశీల్ గేజాని, అమీర్‌పేట మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రాజ్ పురోహిత్, గణేష్ టెంపుల్ మాజీ చైర్మన్ జయరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.

అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌కు ఆహ్వానం..



ఈ నెల 30న గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించే 10వ స్టేట్ మీట్‌కు హాజరు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో తెలంగాణ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ లైఫ్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రభుకుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌పీ భగవాన్, రత్నకుమార్, కోశాధికారి లక్ష్మీలు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి ఆహ్వానించారు.

రేపటి నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న తాడికొండ విజయ్‌కుమార్

రసూల్‌పురా: లోక కల్యాణార్థం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భద్రకాళీ సమేత వీరభద్ర ఆరాధ్య జనసేవా వాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి కల్యాణం వీధి పళ్లెం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ తాడికొండ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడిన అనంతరం బ్రోచర్ ఆవిష్కరించారు. రేపటి నుంచి (14 వ తేదీ నుంచి) నాలుగు రోజుల పాటు(17వ తేదీ) సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జంటనగరాల్లోనే మొదటిసారి ఈ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇవటూరి కైలాస్, తాడిగొండ శశిభూషన్, శివకుమార్, బెల్‌సన్ తాజ్ హోటల్ అధినేత సంజీవరావు, యమునా పాఠక్, దుర్గా ప్రసాద్, విడియాల శశిధర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



గెలుపొందిన చిన్నారులతో స్కూల్ డైరెక్టర్లు, సిబ్బంది

అమీర్‌పేట: పిల్లలను రోజుకు కనీసం ఒక గంటైనా ఆడుకోనివ్వాలని బచ్‌పన్ స్కూలు డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి సూచించారు. బచ్‌పన్ ఇంటర్‌స్కూల్-2023 కాంపిటీషియన్ నిర్వహించారు. విజేతలకు మంగళవారం ఆయన చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీర ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారిని అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధురానగర్ స్కూల్ డైరెక్టర్ మృదుల శర్మ, ప్రిన్సిపాల్ నీరజ్ కక్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో మంగళవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. కోత్‌మీర్ మధు ఆధ్వర్యంలో జరిగిన మహాపడి పూజలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానసిక వికాసం.. మనిషి మనుగడకు ఆధ్యాత్మిక భావన ఎంతో దోహదపడుతుందన్నారు. అయ్యప్పస్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో విరజిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్ఎస్ నాయకులు తలసాని సైకిలాబ్ యాదవ్, ఆకుల హరికృష్ణ, జయరాజ్ పాల్గొన్నారు.

పరామర్శ



కంటోన్మెంట్: యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కలిసి పరామర్శించారు. సోదరి నివేదిత, మాజీ ఎంపీ వేణుగోపాలాచారిలతో కలిసి ఆమె మంగళవారం ఆసుపత్రికి వెళ్లారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నివాళి

లాలాపేట: తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో తార్నాకలోని వంజరి భవన్‌లో మంగళవారం మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి దివంగత నాయకులు గోపీనాథ్‌రావు ముండే సాహెబ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్‌రావు చిత్రపటం ఏర్పాటు చేసిన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, ముఖ్య సలహాదారులు సాల్వేరు ముత్తయ్య, కాలేరు రామోజీ, కార్యదర్శి తిందేరు అమర్, పాండ్ర సత్యం పాల్గొన్నారు.

కథనాలు చదివారు.. పరిష్కారానికి కదిలారు!

వివిధ ప్రాంతాల్లో సమస్యలకు చెక్



మంగళవారం ఛిద్రమైన రహదారులపై ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో ఛిద్రమైన అంతర్గత రహదారులకు త్వరలో మోక్షం లభించనుంది. రూ.2.37 కోట్ల వ్యయంతో ఇంటర్నల్ రోడ్లను నూతనంగా నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించామని, కొన్నింటికి నిధులు మంజూరు కాగా, మరికొన్ని రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. 'రోడ్లు ఛిద్రం..అడుగు భద్రం, అనే శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులతోపాటు కార్పొరేటర్ స్పందించారు. ఎన్నికల నేపథ్యంలో పనుల్లో జాప్యం జరిగిందని, త్వరలోనే చేపడతామని స్పష్టం చేశారు.

ప్రాంతం	మంజూరైన నిధులు
ఇందిరానగర్‌కాలనీ	రూ. 18.50 లక్షలు
వారాసిగూడ	రూ. 14.00 లక్షలు
మార్కండేయనగర్	రూ. 36.00 లక్షలు
డెడ్‌లాక్ బిల్డింగ్	రూ. 39.00 లక్షలు
వెంకటేశ్వరనగర్	రూ. 31.00 లక్షలు

బస్ షెల్టర్ల ఏర్పాటుకు అధికారుల హామీ





జీహెచ్‌ఎంసీ ఆర్టీసీ ఈడీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: వివిధ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడేతుండేవారు. ఈ సమస్యపై 'షెల్టర్లు లేక.. బస్సులు ఆగక' అనే శీర్షికతో సోమవారం 'ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. మంగళవారం సీపీఐ నాయకులు గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించగా, వారం రోజుల్లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్‌లో బస్ స్టాప్‌లు ఉన్నప్పటికీ బస్ షెల్టర్లు లేక వృద్ధులు, మహిళలు, ఉద్యోగాలకు ఇతరత్రా పనులకు వెళ్లే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్ షెల్టర్ లేని కారణంగా కొన్ని చోట్ల బస్సులు ఆపకుండానే వెళ్లిపోతున్నాయన్నారు. ఈ సమస్యను సాక్షి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపిందని అభినందించారు. వినతి ఇచ్చిన వారిలో కొమురెల్లి బాబు, రషీద్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి కదిలిన అధికారులు..



సాక్షిలో ప్రచురితమైన కథనం

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, చంద్రబాబునగర్ బస్తీలోని ఛిద్రమైన రోడ్ల దుస్థితిపై ఇటీవల'గుంతల్... చింతల్ ' శీర్షికతో ఈనెల 9న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం చంద్రబాబునగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్ల తవ్వకం పనులు చేపట్టారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న బస్తీ రోడ్ల దుస్థితిని అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి సాక్షి దినపత్రిక చేసిన కృషిని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షులు కోళ్ల వెంకటేష్ యాదవ్ కొనియాడారు.



చంద్రబాబునగర్ బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రారంభమైన పనులు